
# చెమ్మగిల్లిన వసంతం...



వూదా మబ్బుల ఆకాశం కింద యాజ్‌బెస్టాజ్ రేకులు కప్పిన చిన్నచిన్న గదులు. వొక్కో గది వొక్కో యిల్లు. వొక్కో యింట్లో ఆరేడుమంది. యింత చిన్నచిన్న యిళ్ళల్లో యింతింతమంది యెలా వుంటున్నారో!

యింటి గుమ్మానికి నిలబడి ఆ యిళ్ళ నడుమ ఫుట్‌బాల్ ఆడుతోన్న పిల్లల్ని చూస్తోంటే యెప్పుడో ఆడిన ఆట స్మృతి ఛాయగా మెదుల్తోంది. యెన్నాళ్ళయిందీ ఆటని చూసి... ఆడి... యెప్పుడో ఆడుకొన్న ఆట యెంతిష్టంగా ఆడుకొనే వాళ్ళం. ఆటలు ఆడి యెంతకాలం అయిందో... రేగుతోన్న దుమ్ము, చెలరేగుతున్న కేరింతలు. చాయ్ వాసన. పనుల్లోంచి యింటికి వొస్తున్నవాళ్ళు... మరుగుతున్న చాయ్ ఆవిర్ల పరిమళానికి బండి చుట్టూ చేరినవాళ్ళు.

"నాలుగే అయినా అప్పుడే చీకటైపోతోంది. యెంత చలో..." అనుకుంటూ యింట్లోకి వెళ్ళాను.

చూపులని యెంత విశాలం చేసినా ఆ గదిలోనివి యేవీ కనిపించటంలేదు. యీ కాలమింతే. వెలుగు త్వరగా సెలవు తీసుకొనే కాలం... లైట్ వేద్దామా... యిప్పట్నుంచీ లైట్ వేస్తే కరెంట్ బిల్ ఎక్కువొస్తుంది. ప్చ్... చలి. లైట్ వేసి స్వెట్టర్ తీసుకొన్నా. లైట్ ఆర్పుతుంటే "దక్షా... టి.వి. పెట్టమ్మా" నాన్న అడిగాడు.

పిడతలో టీ తీసుకొస్తోంటే పాదాల ముందు వరకు దొర్లుకొంటూ వచ్చి బాల్ ఆగిపోయింది. ఆ బాల్ వెంట పరిగెత్తుకొచ్చిన కుర్రాడు ముఖంలోకి చూస్తూ చిన్నగా నవ్వాడు. యీ వారంరోజుల్లో నాలుగైదుసార్లు కనిపించాడు. వంగి బాల్ అందుకొంటూ తలెత్తి చూసి "నీ పేరు దక్షా కదా... ఐష్‌లా వున్నావ్. అచ్చు అలానే వున్నావ్" అన్నాడు.

"ఐశ్వర్యారాయ్!"...

"వూ"

"యెవ్వరూ అలా అనలేదే"

"నే చెపుతున్నాగా. యీ దీపక్ మాటంటే మాటే" అంటూ మరోసారి నవ్వి బాల్ తీసుకొని వెళ్ళిపోయాడు. ఐశ్వర్యారాయ్ విశ్వసుందరి అయినప్పట్నుంచి పార్లర్‌లో రద్దీ విపరీతంగా పెరిగిందంటుండేది జూలై.

చేతిలో టీ చలికి ఆరిపోతుంటే అతని వైపు చూపులు. జీన్స్... పసుపు యెరుపు గళ్ళ టీ షర్ట్, మెడలో స్టీల్ గొలుసు. చేతికి కంకణం. హృతిక్‌రోషన్ క్రాఫ్... సిగరెట్ వెలిగిస్తూ తిరిగి నావైపు చూసి నవ్వాడు. తిరిగి నవ్వుతుంటే యెందుకు నవ్వుతాడు. పనేం లేదా యీ టీని యిలా యిస్తే నాన్న యెలా తాగుతాడు.

తిరిగి మరో వేడివేడి టీ తీసుకొన్నా యీ దీపక్ వల్ల వొక టీ డబ్బులు దండగ. టీ నాన్నకి యిచ్చా.

బలహీనమైన యెడమ చేత్తో పిడతని పట్టుకొని టీ తాగుతూ "మీ అమ్మ యింకా రాలేదా" అడిగాడు.

"వస్తుండొచ్చు"

"నాన్న! అక్కా వాళ్ళింటికి వెళ్ళొస్తా"

"అమ్మొచ్చాక వెళ్ళు" అన్నాడు.

యిళ్ళల్లో పనికి వెళ్ళే అమ్మ తెచ్చే డబ్బులే యింటికి ఆధారం. ఫుట్‌బాల్ ఆడుకొంటూ సినిమాలు చూస్తూ స్నేహితులతో కాలం వెళ్ళదీసే అన్నయ్యతో యే పనీ చేయించలేక అమ్మ యేడవటం, చికాకు పడటం, అరవటం యీ వారం రోజుల్లో అనేకానేకసార్లు చూశాను.

బయటొకొచ్చాను.

ఆట ఆపి టీ బండి చుట్టూ చేరి టీ తాగుతున్నారంతా.

సినిమాకి వెళ్ళొచ్చిన అన్నయ్య యింటి కొస్తూనే "యిక్కడ నిలబడ్డావేంటి అమ్మ యింకా రాలేదా, తినటానికి యేమైనా వుందా" అడిగాడు.

"రోటీ వుంది"

యెర్రటి టీ షర్ట్‌కి ఆకుపచ్చ, నలుపు గీతల కాలర్. జీన్స్ అక్కడక్కడ కాస్త కాస్త చింపుకొని మెడలో పూసలదండ. కళ్ళకి నల్ల కళ్ళజోడు. గోవింద క్రాఫ్... అన్నయ్య గోవిందా అభిమాని. యింట్లో అద్దం పక్కన గోవిందా పోస్టర్.

యింట్లోంచి బయటకొచ్చి "వందుంటే యివ్వు" అడిగాడు.

"యెందుకు?"

"చెప్పకపోతే యివ్వవా?... డబ్బులున్నాయ్య అన్నా... యివ్వు. కావాలి..." దబాయింపుగా అడిగాడు.

యీ వారంలో యిలా దబాయించి డబ్బులు లాక్కోవటం రెండోసారి. యేం

అనలేక లోపలికి వెళ్ళి లైటేశాను. పెట్లోంచి వంద తీస్తుంటే లేతాకుపచ్చ కవర్‌పై చూపు నిలిచింది.

ఆ కవర్ తీసుకొని పెట్టె మూసి అన్నయ్యకి వంద యిచ్చాను. నాన్న టి.వి.పై నుంచి చూపు మరల్చటంలేదు. తమ్ముడింకా ఆ టీ బండి దగ్గరే స్నేహితులతో కబుర్లు చెపుతున్నాడు. అమ్మ యింకా పని నుంచి తిరిగి రాలేదు.

ఆకుపచ్చ కవర్ తీసుకొని బయటకొస్తూ "నాన్నా అక్కా వాళ్ళింటికి వెళు తున్నా" అన్నాను.

అతను టి.వి.పై నుంచి చూపులు తిప్పకుండానే 'ఆ' అన్నాడు.

బయటికొచ్చి అక్కావాళ్ళ యింటివైపు వెళ్ళబోతోంటే వో చిన్న స్టీల్ టిఫిన్ డబ్బా పట్టుకొని పనిలోంచి వస్తున్న మిని పలకరింపుగా నవ్వుతూ "నీలా జుట్టు కట్ చేసుకుంటే నాకు బాగుంటుందా" అడిగింది.

"బాగుంటుంది"

"కట్ చేయటం వొచ్చా"

"వూ... చేయనా"

"బాప్‌రే... వొద్దొద్దూ..."

జుట్టు కట్ చేయించుకోడానికి మొదటిసారొచ్చినపుడు దాదాపుగా అందరూ 'యింతే కట్ చేయమనో అంతెక్కువ వద్దనో' జుట్టుని వదులుకోవడానికి కంగారు పడతారు. రకరకాల హెయిర్‌కట్స్‌ని యిష్టపడుతూ కూడా జుట్టు కట్ చేయించు కోవాలంటే 'బాప్‌రే' అనుకుంటారు. కాస్త అలవాటయ్యాక, అదే కట్ నుంచి మరో కట్‌కి మారాలని వున్నా మారటానికి తటపటాయిస్తారు. అలవాటైన వాటి నుంచి బయటికి రావటం చాలా కష్టం. 'యిష్టం వున్నప్పటికి కూడా అలవాట్ల నుంచి బయటపడలేం' నవ్వుతూ మామి అంటుండేది.

అక్కా వాళ్ళింటికి వెళ్ళేసరికి అంతా టి.వి. ముందున్నారు. అక్క రొట్టెలు చేస్తూ వేడివేడిగా అందరికీ అందిస్తోంది.

వో ప్లేట్‌లో రొట్టె, పప్పు, చేపల కూర వేసి అందించింది.

“మీ అక్కని నీ అంత అందంగా తయారుచేయి” అన్నాడు బావ.

“మాధురీ దీక్షిత్‌లా వుంది కదా” అంది బావా వాళ్ళ వదిన.

“యేం కాదు యెంచక్కా సుస్మితాసేన్‌లా వుంది” అంది బావగారి చెల్లెలు.

“ఆంత్రమాలిలా వుంది” అన్నాడు బావగారి తమ్ముడు.

“మొత్తానికి మా చెల్లెలు సినిమా హీరోయిన్‌లా వుందంటారు. నిన్నెవరూ సినిమాల్లో చేయమని అడగలేదా” అడిగింది అక్క.

యివి మాట్లాడటానికి, వినడానికి తనొచ్చిందా. అక్కతో మాట్లాడాలి. తనిన్నాళ్ళు గడిపిన నగరాన్ని, ఆ యింటిని, ఆ యింట్లో మనుషులని, తనెక్కడ పడుకునేది, తినేది, వాక్కో యేడాది తానేమి పనులు నేర్చుకొంది, తనిన్నాళ్ళు యెలా వుందో, వీళ్ళ గురించి యేం ఆలోచించేదో చెప్పాలని వుంది. అలానే అక్క యిన్నాళ్ళు గడిపిన జీవితం, అమ్మా వాళ్ళింటి నుంచి వచ్చాక యీ యింట్లో తనెలా అమరింది యివన్నీ వినాలని వుంది. అవేవి అయ్యేట్టు కనిపించటంలేదు. అక్కతో కాసేపు తనొకర్తి మాట్లాడాలన్న తన ప్రయత్నాలేవీ యీ వారంరోజులుగా ఫలించనే లేదు. తను అక్కతో చాలా పంచుకోవాలనుకుంటుంది. కానీ అక్కకి ఆ తలంపేం లేనట్టే వుంది.

“రసగుల్లా తింటావా, డైటింగా” అక్కా వాళ్ళ తోడికోడలు అడిగింది.

అక్క పెళ్ళయి రెండేళ్ళు అయింది. ఆ పెళ్ళికీ తనని వాళ్ళు పంపించలేదు. పెళ్ళయినా సరే, పంపటానికి వీలుకాదన్నారు. యీ వారంలోనే వీళ్ళందర్నీ చూడటం.

చిన్ని యిల్లు, వుమ్మడి కుటుంబం. యీ యింటితో, యింట్లోని మనుష్యులతో అక్క యిమిడిపోయినట్టే వుంది. తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చింది. యిమిడి పోవటం... అసలు తనకి తన అక్క విషయాలేం తెలుసు. ఆమె ఆలోచనలు, యిష్టాలు, కష్టాలు - వూహూఁ... తనకేం తెలియవ్. అక్క వో అపరిచిత.

అక్కా వాళ్ళ యింటి నుంచి తిరిగి యింటికి వస్తుంటే చేతిలో కవరు మరింత బరువుగా, తేలిగ్గా, బెంగగా క్షణానికోలా... యింటి గుమ్మంలోకి వచ్చేసరికి అమ్మ అరుపులు వినబడుతున్నాయి. యెవరి మీదో అర్థంకాక గుమ్మంలోనే నిల్చున్నా.

ఆ అరుపులు యింట్లో లేని అన్నయ్య మీదేనని అర్థం అయ్యాక లోపలికి వెళ్ళాను.

"వాడికి డబ్బులిచ్చావా" అమ్మ అడిగింది.

"ఆఁ"

"యెందుకిచ్చావ్? సినిమాలు తప్ప మరో వ్యాపకమే లేదాడికి. మొదటిరోజు, మొదటి ఆట చూడాల్సిందే. చేతిలో నాలుగు డబ్బులుంటే తాగటం. నీకేం తెలుసు వాడి గురించి, నన్నడక్కుండా వాడికేం యివ్వకు. అక్కా వాళ్ళింటికి వెళ్ళావా... యెందుకు... డబ్బులు యెంత యిచ్చావని అడిగారా"

"లేదు"

"యెవరిళ్ళకీ నాతో చెప్పకుండా వెళ్ళకు. కొత్తదానివి. నీ డబ్బులన్నీ లాగేసుకుంటారు. మీ అక్క– అదేం పిల్లో. నువ్వక్కడ బాగా సంపాదిస్తున్నావని, తనకేం పెట్టవని తెగ సతాయిస్తుందనుకో. వాళ్ళవైపే మాట్లాడుతుంది. మన దగ్గర డబ్బులుండవని చెప్పదు. నువ్వేదో పంపించబట్టీ ఆ పిల్ల పెళ్ళి చేయగలిగాం... పోనీలే, తిండికి పెద్దగా లోటు లేదాళ్ళకి. డబ్బులున్నాయని మాత్రం చెప్పకు" అంది అమ్మ. తనకేం తెలుసు యీ యింటి గురించి, యీ యింట్లో మనుష్యుల గురించి...

'చలి కంటే యీ యిల్లు, యీ యింట్లో మనుష్యులు యెక్కువ వణికిస్తున్నారే' అనుకొంటూ టి.వి. ముందు కూర్చున్నా.

టి.వి.లో యేదో సినిమా వస్తోంది. మిని ఇంట్లోకి వచ్చింది. టి.వి. వైపు చూస్తూ "యీ సినిమా చూస్తున్నావా... హృతిక్ సినిమా వొస్తుందిగా" అంది.

"హృతిక్ రోషన్ అంటే యిష్టమా..."

"వూ..."

"యింకా..."

"అమితాబచ్చన్... ఆ కవర్ యేంటి" అడిగింది మిని.

రయ్ఁమంటూ తమ్ముడు యింట్లోకి వచ్చాడు.

"అయ్యాయా ఆటలు" విసుక్కుంటూ అమ్మ అన్నం కలిపి తినిపిస్తోంది తమ్ముడికి.

"ఆ కవర్ యేంటి?" తిరిగి మిని అడిగింది.

మెల్లగా ఆ కవర్ విప్పా. అందులోంచి చిన్నిచిన్ని పువ్వుల అట్ట వున్న ఆల్బమ్ తీసా. మినీకి ఇచ్చా.

వొక్కో లీఫ్ తిప్పుతూ మిని అడుగుతోంది - అందులో వున్నవాళ్ళని.

"యీ ఫోటోలో వుంది నేనే. యెనిమిదేళ్ళు... యీ యింటిని వదిలి వెళుతున్నప్పుడు తీసింది. తొమ్మిదేళ్ళ క్రితంది. మేం యీ యింట్లో వుంటున్నాం. నాన్న హౌరా బ్రిడ్జి దగ్గర పనిచేసేటప్పుడు పేవ్‌మెంట్ మీద వుండేవారంట అమ్మా నాన్నా. పేవ్‌మెంట్ మీద నీళ్ళ సప్లయి వుంది కదా. అక్కడే స్నానాలు చేయడం, బట్టలు వుతుక్కోవడం... హౌరా బ్రిడ్జి యెలా వుంటుందో నీకు తెలుసు కదా... మనుష్యులే మనుష్యులు. నాన్నకి ఫ్యాక్టరీలో పని దొరికిందంట. యిద్దరూ పెళ్ళి చేసుకున్నారు. వో చిన్న షెడ్‌లో కాపురం పెట్టారంట. మేం నలుగురం పుట్టాం. అక్కడి నుంచి యిక్కడికి వచ్చారంట. కాస్త రెండు పూటలా తింటున్నాం అనుకున్నారో లేదో మా నాన్నకి యాక్సిడెంట్ అయింది. కుడిచేయి పోయింది. అప్పట్నుంచి నాన్నకి విపరీతమైన భయం పట్టుకొంది. అదిగో, అలా మంచంపైనే. అప్పటికి అమ్మ యిళ్ళల్లో పని చేస్తుండేది. ఫోటో తీయించమని యెప్పుడడిగినా డబ్బులు లేవనేది. వుండేవి కూడా కాదు" అన్నాను.

"మరి ఈ ఫోటో యెక్కడిది" అడిగింది మిని.

"ఆ విషయమే చెబుతున్నా. అమ్మ పనికి వెళ్ళినప్పుడు నన్ను తీసుకు వెళుతుండేది. చిన్నచిన్న పనులు చేయిస్తుండేది" చెపుతోండగా, "దక్షా! యేం చేస్తున్నారిద్దరూ" అంటూ అమ్మ వచ్చింది.

"అన్నం తినిపించటం అయిందా... హైదరాబాద్ ముచ్చట్లు... అసలు నన్ను హైదరాబాద్‌కి యెలా పంపించావ్" అమ్మని అడిగాను.

"హైదరాబాద్‌కా... ఆ౦- యెప్పటి మాట... తొమ్మిదేళ్ళనాటి మాట. ఆరోజు చారులతమ్మ యింట్లో పనిచేస్తున్నా. వాళ్ళ యింటికొచ్చిన స్నేహితులు నిన్ను

చూశారు. నీ విషయం ఆ అమ్మని అడిగారు. 'దక్షా చలాకీగా వుంది కదా... యెందుకిలా యింటింటికి తిప్పుతావ్... మంచి పనిలో పెట్టు' అని చారులతమ్మ నన్నడిగారు.

"యే పనిలో" అడిగా.

"నా స్నేహితురాలికి హైదరాబాద్‌లో బ్యూటిపార్లర్ వుంది. అందులో పని చేయడానికి యిక్కడి నుంచి చిన్నపిల్లల్ని తీసుకెళుతుంది. వాళ్ళకి పనంతా నేర్పిస్తుంది. ఇంగ్లీషు, హిందీలో మాట్లాడటం చెపుతుంది. మూడు పూటలా అన్నం పెడుతుంది. మూడు జతల బట్టలు యిస్తుంది. ఆ కస్టమర్స్ యిచ్చే టిప్స్ యీ పిల్లలే ఖర్చు చేసుకోవచ్చు. పంపించు" అన్నారు చారులత.

"అంత దూరమా"

"యెంత దూరం... యిలా వెళితే రైలు. అలా వొస్తే రైలు. పిల్లకీ పనొస్తాది. నాలుగు డబ్బులొస్తాయి. యిలా యిల్లిల్లూ తిప్పితే యేముంది. ఆ అంట్లు తోమటం తప్ప యేం రాదు" అన్నారు.

"అంత పెద్ద పనులు చేయగలదంటారా"

"యే పనైనా చిన్నప్పుడు నేర్చుకుంటేనే బాగా వస్తుంది. ఆవిడ రెండేళ్ళకోసారి యిక్కడికి వచ్చి ఆరేడుగురిని తీసుకెళుతుంది. వాళ్ళని తిరిగి యేడేళ్ళ తర్వాతే పంపిస్తుంది. పదేళ్ళ కంటే యెక్కువ వుంచుకోదు. చిన్నపిల్లల్నే తీసుకువెళుతుంది. యేడేళ్ళు అయ్యాక తీసుకొచ్చి పిల్లల్ని అప్పజెపుతుంది. పంపించు. పిల్ల నీడ పట్టున మెరుస్తూ పెరుగుతుంది. నీకే భయం అక్కర్లేదు. నాది పూచి" అన్నారామె.

"యేడాదేడాదికి పిల్లని చూడడానికి పంపరా"

"పంపరు. అలా పంపిస్తే పిల్లల ధ్యాసంతా యింటి మీదే వుంటుంది. ప్రతి యేడాది వొస్తే రైలు ఛార్జీలు దండగ. రావటానికి పోవటానికి పది పదిహేను రోజులైనా పడుతుంది. కదా... పని దండగా..."

"అక్కడ పిల్లలు దొరకరా"

"అక్కడా... యెక్కడైనా దొరుకుతారు. అక్కడ పిల్లల్ని పెట్టుకుంటే యేముంది. యిలా పని నేర్చుకొని అలా మరో పార్లర్‌కి వెళ్ళిపోవచ్చు. లేదా, వాళ్ళే వొకటి

పెట్టి, మా దగ్గర యింకా తక్కువ డబ్బులకి సర్వీస్ చేస్తామని యిక్కడ కస్టమర్స్‌ని పట్టుకుపోవచ్చు. యింట్లో పండగో, పూజో, బంధువులొచ్చారనో, వంట్లో బాగా లేదనో మానైవచ్చు. తరచూ మానేస్తే కష్టం కదా... పని దెబ్బ తింటుంది. యిక్కడి పిల్లలనుకో. ఆ యింట్లోనే వుంటారు. అక్కడే పనిచేస్తారు. తింటారు, నిద్రపోతారు. అటూ యిటూ వెళ్ళరు... బోర్డర్లో పిల్లలకి యీ మాత్రం పనెక్కడ దొరుకుతుంది చెప్పు? చాలా డిమాండ్ వుంది. నీత లేదూ, తనూ వెళుతుంది. మన పిల్లలు శ్రద్ధగా పని నేర్చుకుంటారు. అన్నిటికంటే ముఖ్యంగా తక్కువ డబ్బులకి పని చేస్తారు. అది వాళ్ళకి తక్కువ, మనకి యెక్కువ. చీప్ లేబర్‌కి డిమాండ్ యెక్కువ, పోటీ కూడా యెక్కువే... పంపించు. మన పిల్లలే కలిసిమెలిసి పని చేసుకుంటారు..." అని చెప్పారు చారులత.

అంత పెద్ద లాయరమ్మ చెపుతుంటే బానే వుందనిపించింది. తిండి, బట్ట పెట్టి సంవత్సరానికి యింతని యిస్తారు. డబ్బు అవసరం వుంది కదా అనుకొంటూ 'ప్రతి యేడాది డబ్బు పంపించినా యింట్లో అలా యేదో అయిపోతుందమ్మా!... పెద్దదానికి ఐదారేళ్ళలో పెళ్ళి చెయ్యాలి కదా... అప్పుడే మొత్తం వొకేసారి యిమ్మని చెప్పమ్మా!' అన్నాను. పంపించాలనుకున్నా. వెళ్ళటానికి నువ్వు గొడవ చేసావు. ఫోటో తీయిస్తానని ఆశ పెట్టి వొప్పించా. అప్పటిదీ ఫోటో" అంది అమ్మ.

"అప్పుడు యిన్నేళ్ళు అక్కడుండాలని తెలియదు. వూరెళ్ళి రావటం అంటే రోజులనుకున్నా" చెప్పాను.

"అక్కడికి వెళ్ళాకా" అడిగింది మిని.

"మామూలే. ఆరుగురం రైలెక్కాం. హైదరాబాద్ వెళ్ళాం. పెద్దపెద్ద యిళ్ళున్న కాలనీ రోడ్డుమీద పార్లర్ వుంది. అపార్ట్‌మెంట్‌లో పక్కపక్కనే ఫ్లాట్స్. వొకదాంట్లో మామి యిల్లు. రెండో దాంట్లో పార్లర్. మామి పెద్దకోడలు జూలై. పెళ్ళయి యేడాది అయిందంట. కలకత్తాలోనే పుట్టి పెరిగిందంట. మామిదే పెత్తనమంతా... వెళ్ళినరోజు జూలై మాకు హెయిర్ కట్ చేసింది. గోళ్ళు కట్ చేసి, పాలిష్ వేసింది. మా పాదాలని మిగిలిన పిల్లలు శుభ్రం చేశారు. మామి మిని స్కర్ట్స్, టాప్స్ యిచ్చింది. మొదట్లో చిన్నిచిన్ని పనులు చేయటం, వాక్సింగ్ చేసినవాళ్ళ కాళ్ళు చేతులు స్పాంజ్‌తో క్లీన్ చేయటం, కట్ చేసిన జుట్టుని యెత్తటం లాంటి పనులు చేస్తూ, మిగిలిన పనులు యెలా చేస్తారని గమనిస్తూ,

సాయంకాలం మాలో మేం వొకరిపై వొకరు మసాజ్‌లు ట్రెడింగ్, వాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తుండే వాళ్ళం. యింగ్లీషులో, హిందీలో మాట్లాడటం నేర్చుకొంటూ, వచ్చేపోయే వాళ్ళని గమనించటం. వాళ్ళంతా బాగా డబ్బున్నవాళ్ళు. చదువకున్నవాళ్ళు. స్టూడెంట్స్. పెళ్ళికూతుర్లని తయారుచేయటం సరదాగా వుండేది. అచ్చు సినిమాల్లో చూపించేట్టు మిరుమిట్లు గొలిపేట్టు వుండేవారు" అన్నాను.

"వుదయం యెప్పుడు లేచేవాళ్ళు" అడిగింది మిని.

"వుదయం ఆరు, ఆరున్నరకి లేచేవాళ్ళం. యెనిమిదిన్నరకల్లా రెడీగా పార్లర్‌కి వెళ్ళేవాళ్ళం. తొమ్మిది నుంచి కస్టమర్స్ వస్తుంటారు. అలా సాయంకాలం యేడున్నర వరకు. పార్టీలు, పెళ్ళిళ్ళు మేకప్ అంటూ వస్తే రాత్రి తొమ్మిది, పది కూడా అయ్యేది. వుదయం వో పెద్ద గిన్నెనిండా అన్నం, కూర వండి టేబిల్‌పై వుంచేవారు. యెవరికి యెప్పుడాకలేస్తే అప్పుడు వెళ్ళి తినటం. యెంతైనా తినొచ్చు. టి.వి. చూసేవాళ్ళం. మామి వూరెళ్ళినప్పుడు జూలై మమ్మల్ని సినిమాలకి తీసుకెళ్ళేది. మాకు టిప్స్ బాగా వచ్చేవి. ఐస్‌క్రీమ్స్, పీజా, పేస్ట్రీస్, చాక్‌లెట్స్- యిలా చాలా కొనుక్కునేవాళ్లం. మాకు వొంట్లో బాగా లేకపోతే జూలై మాతోనే వుండి చూసుకునేది. మేమంతా తనని జూలై అనే పిలుస్తాం" చెప్పాను.

అప్పటికే అమ్మ వెళ్ళి నిద్రపోయింది.

టి.వి. చూస్తూనే వున్నాడు నాన్న.

"అమ్మావాళ్ళు గుర్తొచ్చేవాళ్ళు కాదా"

"మొదట్లో బాగా గుర్తొచ్చేవారు... సంవత్సరాలు గడిచేకొద్దీ యెలా అయిపోయిం దంటే మా పార్లర్‌కి నందా అని వొకరొచ్చేవారు. అక్కడ పెళ్ళయినవాళ్ళని ఆంటీ అని, పెళ్ళి కాని వాళ్ళని అక్కా అని పిలవాలని రూల్. నందక్క మంచిది. కంప్యూటర్ యింజినీర్. పెళ్ళెందుకు చేసుకోలేదంటే, నచ్చినవాళ్ళు దొరకలేదంది. నా చిన్నతనం గురించి అడుగుతుండేది. అలా వొకసారి హెడ్ మసాజ్ చేయించు కుంటూ నందక్క మాట్లాడుతూ మాట్లాడుతూ 'మీ అక్క పేరేంటి' అని అడిగింది.

చప్పున గుర్తు రాలేదు. అక్క పేరు మర్చిపోయాను. మర్చిపోయానని తెలియ నంతగా మర్చిపోయాను. కాసేపటికి గుర్తొచ్చి చెప్పాను.

"యింతసేపు ఆలోచించావేంటి" అడిగింది నంద.

"మర్చిపోయా"

"మర్చిపోయావా!..." నందక్క ముఖంలో ఆశ్చర్యం.

"ఆఁ... చాలాకాల్మం అయింది. రోజా గుర్తుచేసుకోడానికైనా యేం లేదుకదా?" అన్నాను.

"యెన్నాళ్ళయింది"

"ఐదేళ్ళు"

"ఐదేళ్ళ నుంచి నువ్వు మీ యింట్లో యెవర్ని చూడలేదా..."

"లేదు"

"యెందుకని"

"యేడేళ్ళ వరకు వెళ్ళటానికి లేదంట. రెండు మూడు నెలలకొకసారి యింట్లో వాళ్ళు ఫోన్ చేయవచ్చు... తరచు చేస్తే యింటికి వెళ్ళిపోతామంటామని చెయ్యొద్దంటారు" చెప్పాను.

"యిన్నేసి యేళ్ళు యింత చిన్న వయస్సులో పేరెంట్స్‌ని చూడకుండా వుండాలి!... యిదేం పద్ధతి... వో... మామి, జూలై యెందుకిలా చేస్తున్నారు" అంది.

"వాళ్ళిద్దరూ చాలా మంచివాళ్ళు. మమ్మల్ని చాలా బాగా చూసుకుంటారు. వొక్క మాట అనరు. అన్నీ యిస్తారు" అన్నాను.

"యేడ్చినట్టుందీ మంచితనం"

"యెందుకు అక్కా... బాధపడతావ్... నాకిక్కడ బాగుంది" అన్నాను.

"మనం ఆడి పాడి వొక్కచోట పెరిగిన అక్కచెల్లెళ్ళు తమ్ముళ్ళ పేర్లు మర్చిపోయినంత బాగుంది. మన యింట్లోవాళ్ళకి మన ముఖం, మనకి వాళ్ళ ముఖాలు గుర్తు లేనంతగా మసకబారిపోయినంతగా బాగుంది..." అని నందక్క బాధపడుతోంటే,

"అక్కా, యివన్నీ చెప్పానని జూలైకి చెప్పకు" అన్నాను.

"చెప్పను" అంటూ వెళ్ళే ముందు "సారీ దక్షా..." అని వెళ్ళిపోయింది. ఆ తర్వాత

నందక్క వచ్చి నన్ను, నాతో వున్న అందర్ని, జూలైని, మామిని పలకరించి వెళ్ళేది. న్యూయియర్‌కి స్వీట్స్ యిచ్చేది. వొకసారి మా అందరిని వాళ్ళింటికి డిన్నర్‌కి పిలిచింది. వెళ్ళాం. కానీ ఆ తర్వాత యెప్పుడూ తను నాతో ఫేషియల్, హెడ్ మసాజ్ లాంటివి చేయించుకునేది కాదు. జూలైతో ఐబ్రోస్ క్లీన్ చేయించుకునేది. అంతే, పార్లర్‌లో ఐబ్రోస్, హెయిర్‌కట్ జూలై చేస్తుంది. ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. అమ్మా, నాన్న, అక్క, అన్న, తమ్ముడు అంతా జ్ఞాపకం. వారి రూపాలు తెలియటం లేదు. లీలగా మా యిల్లు, ఆ యింట్లో సామాను యెలా వుంటాయో గుర్తు రావటంలేదు. యింటి పక్కవాళ్ళు, యెదుటివాళ్ళు యెవ్వరూ గుర్తు రావటం లేదు. అలాగని అసలే జ్ఞాపకాలు లేవని కాదు... గుర్తొచ్చీ రాక... కాళీ టెంపులు, దుర్గ పూజలప్పటి సందడి, హౌరా బ్రిడ్జి... అంతా కలగాపుల గంగా... అయోమయంగా... యింటికి వెళ్ళిపోవాలని బలంగా అనిపించింది. తెల్లార్తుంటే దుఃఖం యెక్కువయింది... జూలైని నిద్ర లేపాను.

"యేంటి దక్షా"

"యింటికి వెళతా"

"కలొచ్చిందా"

కలలో అమ్మా, అక్కా, నాన్న కనిపించినా వాళ్ళే మా అమ్మా, నాన్న అని గుర్తు పట్టలేని నేను కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ "వొక్కసారి చూసొస్తా" అన్నాను.

"అలా యేడిస్తే యెలా... నీతాని చూడు, నేపాల్ నుంచి బోర్డర్‌కి వచ్చారు. అక్కడ సరియైన యిల్లు లేదు. తిండి లేదు. వొకచోట నుంచి మరోచోటికి పరి గెత్తటమే. అలాంటి సమయంలోనే నీతా వాళ్ళ అక్కని వాళ్ళ మామ సొనాగచ్చిలో అమ్మేసాడు. మామి కాంటాక్ట్ దొరికి, నీతాని వాళ్ళమ్మ యిక్కడ వదిలింది. మైనాని చూడు, బంగ్లా యుద్ధంలో కలకత్తా వచ్చారు... యెవరెక్కడున్నారో తెలియదు.... నా విషయం తీసుకో... కలకత్తాలో పుట్టాను. పెరిగాను. మా అక్క అక్కడే పుట్టి పెరిగింది. పని వెతుక్కుంటూ మా అమ్మా నాన్న యిక్కడికి వచ్చారు. వాళ్ళ వాళ్ళంతా అక్కడే. మనం యెక్కడ వుంటే అక్కడే సంతోషంగా వుండాలి. డబ్బులు లేకపోతే యెలా బతుకుతాం చెప్పు? యింకెన్నాళ్ళు" అంది జూలై.

యేడుస్తూనే వున్నా.

"ప్లీజ్ దక్షా!... మామికి యిక్కడివాళ్ళని పెట్టుకుంటే వాళ్ళు వెళ్ళిపోతారని భయం. బిజినెస్ దెబ్బతింటుందని భయం. డబ్బులు లేకపోతే దేశం కాని దేశంలో యెలా బతుకుతామనే భయం. మామికి యిక్కడికి వచ్చినప్పట్నుంచి బోల్డన్ని భయాలు. సంవత్సరానికోసారి మీరు వెళ్ళొచ్చే వీలుంటే బాగుండును. కానీ మామి భయాలు మామివి. అవి తీసెయ్య తగ్గ భయాలు కూడా కాదు. యేడవకు. పడుకో" వోదారుస్తూ నా దగ్గరే కూర్చుంది జూలై. అనేక విషయాలు మాట్లాడింది కదా... నాకు స్పష్టంగా వొక విషయం మాత్రం అర్థం అయింది. యెంత యేడ్చినా పంపరు. పంపితే వెళ్ళి అక్కడే వుండిపోవాలి తప్ప తిరిగి రావటానికి వొప్పుకోరు. యెవరి రూల్స్ వాళ్ళవి."

"సంవత్సరానికి యెంతిస్తారు" అడిగింది మిని.

"రెండు వేలు... యేడేళ్ళకి పధ్నాలుగు... యెనిమిదేళ్ళుంటే పదహారు..."

"అక్క పెళ్ళికి కొంత డబ్బు పంపించేసింది మామి. మిగిలింది నేనొచ్చినప్పుడు యిచ్చింది" చెప్పాను.

"మీ దగ్గరికి సినిమా యాక్టర్లు వస్తారా" అడిగింది మిని.

"వాళ్ళు అపాయింట్‌మెంట్ తీసుకుంటారు. కారు పంపిస్తారు. మేం వాళ్ళింటికి వెళ్ళి, వాళ్ళకి కావల్సినవన్ని చేస్తాం..."

"యేయే యాక్టర్లని చూసావ్" అడిగింది మిని.

"ఆఁ చాలామందిని."

"యేంటి ఆలోచిస్తున్నావ్" అడిగింది మిని.

"నేనొచ్చే ముందు జూమ వచ్చింది. తొమ్మిదేళ్ళు. రోజూ యేడుస్తుండేది. మేమంతా యిక్కడ్నుంచి వెళ్ళినవాళ్ళమే కదా! వొకే భాష. అదొక్కటే బాగుండేది తనకి. తనని చూస్తుంటే మాకు గుర్తొచ్చేది. వచ్చిన కొత్తలో మాకు అలానే యే పని చేయటం వచ్చేది కాదు. చిన్నిచిన్న పనులు మాకంటే ముందున్న వాళ్ళు నేర్పించే వారు. కొత్తగా పార్లర్‌లో చేరటానికి యెవ్వరు వచ్చినా మా అందరికి మేం కొత్తగా వచ్చినప్పటి రోజులు యెలా వుండేవో గుర్తొచ్చేవి. ఫస్ట్ టిప్ రావటం, ప్రేస్టీస్,

ఐస్‌క్రీమ్, బర్గర్ ఫస్ట్ టైమ్ రుచి చూడటం యివన్నీ గుర్తొచ్చేవి. జూమ యెలా వుందో'' అన్నాను.

✦

పొద్దు గడవటం కష్టంగా వుంది. లోకల్ పార్లర్‌లో పని వెతికాను. 'పిల్లకి పెళ్ళి చేయరా' అని తల్లిని వాళ్ళు వీళ్ళు అడగటం వింటూనే 'డబ్బులేవి' అంటుందామె. సరైన పని దొరకటంలేదు.

అన్నయ్య యే పనీ చేయడు. అమ్మ యెన్నాళ్ళిలా కష్టపడుతుంది...

జూలై గుర్తొస్తోంది. పని తప్ప మరో ఆలోచనే వుండేది కాదు...

ఆ రాత్రి జూలైకి ఫోన్ చేయటానికి రోడ్డు మీదున్న ఎస్.టి.డి. బూత్‌కి వెళుతోంటే మిని 'నేనొస్తా' అని వెంట వచ్చింది.

జూలైకి కాల్ చేసి ''నేనొచ్చేస్తా'' అన్నాను.

''యిక్కడికి వచ్చేస్తే నీకు పని తప్ప యేం వుండదు దక్షా! అక్కడే పని వెతుకు... పెళ్ళి చేసుకో. పిల్లలు కను... వాళ్ళని పెంచు. యివి వొక వయస్సు దాటాక చేయలేం కదా... యీలోగా కాస్త డబ్బులు వెనకేసుకొని పార్లర్ పెట్టు...'' జూలై నిదానంగా చెప్పుకుంది.

''జూలై!... నాకేం తెలియని రోజుల్లో నీ దగ్గరకి వచ్చాను. పని వచ్చింది. కానీ, నా అంతట నేనేం ప్లాన్ చేసుకోలేకపోయాను. నాన్నకి శారీరకంగా వొక చేయి లేదు. కానీ, ఆయన మానసికంగా యే పనీ చేయకుండా వుండటానికి అలవాటు పడిపోయారు. ఆయనకి ఆ మంచం, ఆ టి.వి. చాలు. తమ్ముడు స్కూల్‌కి వెళ్ళటంలేదు. అన్నయ్యకి యే బాధ్యతా లేదు. నేనిక్కడ వుండి పని చేయటం మొదలుపెడితే సంపాదించిందంతా మా అన్నని పెంచటానికే సరి పోదు. పెళ్ళి చేసుకొనే పరిస్థితులూ లేవు. నే మరో నాలుగేళ్ళు పనిచేస్తా. యెనిమిది వేలు వస్తాయి. మన దగ్గరికి వచ్చేవాళ్ళు యెవరైనా చిన్ని మాట సాయం చేస్తే కాస్త లోన్ దొరుకుతుందేమో... పార్లర్ పెట్టుకుంటా... అప్పుడు కావాలనుకున్నప్పుడు వచ్చి వీళ్ళని చూడొచ్చు. యిక్కడే పెట్టుకుంటా... అప్పుడాలొచిస్తా.''

''అక్కడేం దొరకదా'' అడిగింది జూలై.

"తెలియదు. దొరికినా ఆ డబ్బుల్ని కాపాడుకోలేను. అన్నింటికంటే ముఖ్యంగా నాకో భయం వుంది" అన్నాను.

"యేంటి?"

"యిక్కడంతా వో హీరోయిన్‌లా చూస్తున్నారు. యెక్కడైనా యేమరుపాటుగా వుంటాననే భయం. యెవరికి యే పనీ లేదు. సినిమాలు చూడటం తప్ప... అయోమయంగా వుంది. యింకొన్నాళ్ళు పని చేస్తే నాకు కాస్త విషయాలు అర్థమవుతాయనిపిస్తోంది" చెప్పాను.

అటు నుంచి జూలై చిన్నగా నవ్వుతూ "పనికిమాలిన వాళ్ళ ప్రేమలో పడతా వేమోననే భయంగా వుందా" అంది.

"యేమో... చెప్పు జూలై, వచ్చేనా... అక్కడ అలవాటైపోయింది. యిక్కడ యెలా వుండాలో తెలియటంలేదు. అంతా అయోమయంగా వుంది. యిక్కడ వాళ్ళకి నాకు పని యివ్వాలంటే బెరుగ్గానే వుంది. వేరే పార్లర్ పెడతానేమోనని. యింకొంత మంది వాళ్ళు పార్లర్ పెట్టి చాలా తక్కువ జీతంతో నాతో పని చేయించుకోవాలను కుంటున్నారు" చెప్పాను.

"అక్కడ వుంటేనే యేదో వొక దారి కనిపిస్తుంది" అంది జూలై.

"పార్లర్ పెట్టటానికి డబ్బులు కావాలి. అంత డబ్బు యెక్కడ నుంచి తీసుకొస్తాను. మామూలుగా పెడితే యెవ్వరూ రారు. నేనున్నచోట చిన్నచిన్నవి చేయించుకుంటే అంతా తెలిసినవాళ్ళే కదా... సరిగ్గా డబ్బులు యివ్వలేరు. అన్ని డబ్బులు కూడా వుండవ్" చెప్పాను.

"నాకో రెండ్రోజులు టైమ్ యివ్వు దక్షా!... యిప్పటివరకు యెవ్వరిని తిరిగి తీసుకోలేదు. మామితో కూడా మాట్లాడాలి" అంది జూలై.


జూలైతో మాట్లాడి వెనక్కి వస్తోంటే దీపక్ యెదురొచ్చి "ఐ లవ్ యూ" అన్నాడు.

వొక్కసారిగా నిస్సత్తువ ఆవరించింది.

అంతలోనే వొక్కసారిగా నందక్క మాటలు గుర్తొచ్చాయి. జూలై గుర్తొచ్చింది. పార్లర్‌కి వచ్చే స్త్రీలు, పిల్లలు గుర్తొచ్చారు. తల్లి గుర్తొచ్చింది.

"యింకెప్పుడూ యిలా మాట్లాడకు" అని స్పష్టంగా చెప్పాను.

మనసు పరిపరివిధాలా పోతోంది. తన తమ్ముడు స్కూల్‌కి వెళ్ళడు. మిని వెళ్ళదు. యిక్కడా యీ చుట్టూ తిరుగుతోన్న యెవ్వరూ సరిగ్గా స్కూల్‌కి వెళ్ళలేరు. అన్న, అక్కా అంతా అంతే. తనూ వెళ్ళలేదు. యెందుకిలా... ఆలోచిస్తోంది... అప్పుడు తను చిన్నది. నిర్ణయాలు తన చేతిలో లేవు. యిప్పుడు తను నిర్ణయించుకోవచ్చు... కానీ, యీ చుట్టూ పరిస్థితులు మన నిర్ణయాలని సాగనిస్తాయా... ఆలోచిస్తూ నిదానంగా అడుగులేస్తోంటే 'నేనెక్కడో తప్పిపోయాను. యెక్కడా.. యెలా...'



ప్రస్థానం
*జనవరి-మార్చి 2003*